

# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్ Evening 6PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 59 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు : 2 +https:www.prajarepublic.com + వెల - 1/-

గురువారం 03 అక్టోబర్ 2024

RNI No: APTEL/2023/87888

Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ఆర్జీకర్ ఆసుపత్రిలో వైద్యురాలి విగ్రహం.. నెట్టింట విమర్శలు

▪ కోల్‌కతా ఆసుపత్రిలో హత్యాచారానికి గురైన వైద్యురాలి విగ్రహాన్ని ఏర్పాటుచేయడం నెట్టింట తీవ్ర చర్చకు దారితీసింది.




**కోల్‌కతా, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన కోల్కతా జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ క్రమంలోనే ఘటన చోటుచేసుకున్న ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ఆసుపత్రిలో తాజాగా మృతురాలికి నివాళిగా ఓ అమ్మాయి విగ్రహాన్ని ఏర్పాటు చేయడం తీవ్ర చర్చనీయాంశమైంది. అది బాధితురాలిని అగౌరపర్చేలా ఉందంటూ పలువురు నెట్టింట విమర్శలు వ్యక్తం చేస్తున్నారు. ఆసిత్ సైన్ అనే శిల్పి ఈ మహిళ విగ్రహాన్ని రూపొందించారు. హత్యాచార సమయంలో బాధితురాలు అనుభవించిన క్షోభను ప్రతిబింబించేలా రూపొందించిన ఆ విగ్రహానికి 'క్రై ఆఫ్ ది అవర్ అని పేరు పెట్టారు. దీన్ని ఇటీవల ఆర్జీ కర్ మెడికల్ కాలేజీ ప్రాంగణంలోని ప్రిన్సిపల్ కార్యాలయానికి సమీపంలో ఏర్పాటుచేశారు. "ఇది బాధితురాలి విగ్రహం కాదు. ఘటన సమయంలో ఆమె అనుభవించిన వేదన, హింసకు ప్రతీకగా దీన్ని ఏర్పాటుచేశాం" అని తెలిపారు. దీనికి సంబంధించిన చిత్రాలను కొందరు సామాజిక మాధ్యమాల్లో షేర్ చేయడంతో ఇవి కాస్తా వైరల్‌గా మారాయి. ఈ విగ్రహం ఏర్పాటు వెనక ఉద్దేశం మంచిదే అయినప్పటికీ.. నెట్టింట దీనిపై పెద్దఎత్తున చర్చ జరుగుతోంది. "ఇది బాధితురాలిని అవమానించడమే. ఓ అత్యాచార బాధితురాలిని ఆధారంగా చేసుకుని ఇలాంటి విగ్రహాలను ఎలా ఏర్పాటుచేస్తారు? ఇది మంచి సలహా అని ఎవరు చెప్పారు? దీన్ని ఎవరు ఆమోదించారు?" అంటూ పలువురు నెటిజన్లు ఆగ్రహిస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు 9న కోల్‌కతా లోని ఆర్జీకర్ మెడికల్ కాలేజీలో 31 ఏళ్ల జూనియర్ వైద్యురాలు సెమినార్ హాల్ లో అర్ధనగ్న స్థితిలో విగత జీవిగా కన్పించిన సంగతి తెలిసిందే. ఆమెపై అత్యంత పాశవికంగా అత్యాచారానికి పాల్పడి హత్య చేసినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు. ఈ ఘటనకు పాల్పడిన సివిల్ వాలంటీర్ సంజయన్ని అరెస్టు చేశారు. ప్రస్తుతం దీనిపై సీబీఐ దర్యాప్తు జరుగుతోంది. మరోవైపు, ఈ ఘటనను నిరసిస్తూ కోల్కతాలో జూనియర్ వైద్యుల ఆందోళన కొనసాగుతోంది.

# డిజిటల్ కార్డు.. ఫ్యామిలీకి రక్షణ కవచం :సీఎం రేవంత్

● సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.



**హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** సంక్షేమ పథకాలు అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతోనే ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వాలని నిర్ణయించామని తెలంగాణ సీఎం రేవంత్రెడ్డి అన్నారు. రేషన్కార్డు కోసం గత పదేళ్లు ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరిగారన్నారు. సికింద్రాబాద్ లోని కంటోన్మెంట్లో కుటుంబ డిజిటల్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా భారాస నేతలపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. కేటీఆర్, హరీశ్రావు, సబితా ఇంద్రారెడ్డి కుమారుల ఫాంహౌస్ లు కూల్చాలా? వద్దా? చెప్పాలని ప్రశ్నించారు. అవి కూల్చుతామనే పేదలను అడ్డుపెట్టుకుని ధర్నాలు, దీక్షలు చేస్తున్నారన్నారు. "మూసీని అడ్డంపెట్టుకుని ఎంతకాలం బతుకుతారు.. హైదరాబాద్ లో మీ భరతం పడతాం" అని భారాసను ఉద్దేశించి సీఎం వ్యాఖ్యానించారు.

## ఎక్కడైనా రేషన్ తీసుకునే వెసులుబాటు

"కేసీఆర్ అధికారంలో ఉంటే రేషన్కార్డు రాదని ప్రజలు కాంగ్రెస్కు అధికారం ఇచ్చారు. కొత్తగా రేషన్కార్డులు లేకపోవడంతో ప్రభుత్వ పథకాలు అందడం లేదు. సంక్షేమ పథకాల అమలుకు డిజిటల్ కార్డులు అవసరం. ప్రతి పేదవాడికీ కార్డు అందించాలనే లక్ష్యంతో ఉన్నాం. రేషన్, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్కు ఈ ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఉపయోగపడుతుంది. ఇది కుటుంబానికి రక్షణ కవచం. దీనిలో ఆరోగ్యపరమైన వివరాలు కూడా పొందుపరుస్తాం. గతంలో ఏ వైద్యం అందింది.. ఏ మందులు వాడారు అనేది వైద్యులకు సులభంగా అర్థమవుతుంది. గ్రామాల నుంచి ఉపాధి కోసం పట్టణాలు, నగరాలకు వచ్చిన పేదలు ఉన్న ప్రాంతంలోనే రేషన్ తీసుకునే వెసులుబాటు కలుగుతుంది. నియోజకవర్గానికి రెండు చోట్ల దీన్ని పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తున్నాం. దీనిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు సరిదిద్దుతాం" అని సీఎం రేవంత్రెడ్డి అన్నారు.

## విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారు

అధికారం కోల్పోవడంతో విచక్షణ కోల్పోయి మాట్లాడుతున్నారని పరోక్షంగా కేటీఆర్, హరీశ్రవును ఉద్దేశించి సీఎం అన్నారు. "నిరుద్యోగుల ఉసురు పోసుకున్నారు.. అందుకే మీ ఉద్యోగం వారు తీశారు. అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లో 30 వేలమందికి ఉద్యోగాలు ఇచ్చాం. డిసెంబర్లోపు మరో 30వేలకు పైగా ఇవ్వాలని నిర్ణయించాం. టీచర్ల నియామకాలు చేపట్టబోతున్నాం. త్వరలో ఎల్బీ స్టేడియంలో 11వేల మందికి నియామక పత్రాలు ఇవ్వబోతున్నాం. హైదరాబాద్లోని ట్రాఫిక్, వరద సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపడుతుంటే బావ, బావమరిది బురదచల్లుతూ తిరుగుతున్నారు. కిరాయి మనుషులతో మీరు చేసే హడావిడిని తెలంగాణ సమాజం నిశితంగా గమనిస్తోంది.

## ఈటల రాజేందర్.. ప్రధాని వద్దకు వెళదాం


అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తాం.. వచ్చి సలహాలు ఇవ్వండి. చిన్నపాటి వర్షానికి మునిగిపోతున్న నగరాన్ని కాపాడుకుందాం. కేటీఆర్, హరీశ్రావు.. సచివాలయానికి రండి.. 4 రోజులు చర్చిద్దాం. ఈ ప్రభుత్వం పేదల కన్నీళ్లు చూడదలచుకోలేదు. మూసీ నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో సూచనలు ఇవ్వండి. ఈటల రాజేందర్.. మీ నేతృత్వంలో నిధుల కోసం ప్రధాని మోదీ వద్దకు వెళదాం. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ను తీసుకురండి.. కేంద్రం నుంచి రూ.25వేల కోట్లు ఇప్పించండి. హైదరాబాద్ నగరంలో చెరువులను ఆక్రమించింది ఎవరో తేల్చుదాం" అని సీఎం అన్నారు.

## దోచుకున్న సొమ్ము నుంచి రూ.500 కోట్లు ఇవ్వండి

పేదలకు అన్యాయం జరిగిందని ఏడుస్తున్నారు కదా.. రాష్ట్రాన్ని దోచుకున్న నిధులు రూ.1500 కోట్లు మీ పార్టీ ఖాతాలో ఉన్నాయి. వాటి నుంచి రూ.500 కోట్లు మూసీ పరివాహక ప్రాంత ప్రజలకు పంచిపెట్టండి. అధికారంలోకి రాకముందు వేసుకునేందుకు మీకు చెప్పులు కూడా లేవు కదా.. ఈరోజు పార్టీ ఖాతాలోకి రూ.1500 ఎలా వచ్చింది? హైడ్రాపై అసెంబ్లీలో చర్చ జరగలేదా? ఆరోజు ఎందుకు సూచనలు చేయలేదు? ప్రత్యామ్నాయంగా ఏం చేయాలో చెప్పండి. వినడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉంది. మూసీ పరివాహక ప్రాంత పేదలకు 15వేల ఇళ్ల కేటాయింపునకు ఆదేశాలు ఇచ్చాం.

# ఈ నెల 7న దిల్లీకి ఏపీ సీఎం చంద్రబాబు

ఏపీ సీఎం చంద్రబాబు ఈ నెల 7న ఢిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో ఆయన భేటీ కానున్నారు.



**అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** ఏపీ సీఎం చంద్రబాబు ఈ నెల 7న దిల్లీ వెళ్లనున్నారు. ప్రధాని మోదీతో పాటు పలువురు కేంద్రమంత్రులతో ఆయన భేటీ కానున్నారు. రాజధాని అమరావతికి నిధులు, మరికొన్ని ఇతర అంశాలకు కేంద్ర సాయాన్ని కోరే అవకాశముంది. మరోవైపు రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ సమావేశమైన రాష్ట్రానికి సంబంధించిన అంశాలపై సీఎం చర్చించనున్నారు.

# సినీ ప్రముఖులు ఈ అంశానికి ముగింపు పలకాలి: టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్




**హైదరాబాద్, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** మంత్రి కొండా సురేఖ సినీ రంగంలోని వ్యక్తుల గురించి చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. అనుకోకుండా తాను ఆ వ్యాఖ్యలు చేశాననని.. వాటిని ఉపసంహరించుకున్నట్లు సురేఖ చెప్పారన్నారు. ఈ ఘటనపై ఆమె 'ఎక్స్'లో పోస్టు చేయడంతో పాటు మీడియాతోనూ చెప్పారని తెలిపారు. అందుకే సినీ ప్రముఖులు ఈ అంశానికి ముగింపు పలకాలని కోరారు. ఇరువైపులా మహిళలున్న విషయాన్ని గ్రహించాలని కోరారు. మహిళల పట్ల కేటీఆర్ అహంకార ధోరణిని ప్రశ్నించడమే కానీ.. ఎవరి మనోభావాల్నీ దెబ్బతీయడం ఉద్దేశం కాదని సురేఖ పేర్కొన్నట్లు చెప్పారు. "మంత్రి సురేఖపై కేటీఆర్ పార్టీకి సంబంధించిన వ్యక్తులు పోస్టులు పెట్టారు. ఓ సోదరుడిగా ఓ సోదరికి నూలుపోగు దండ వేసిన విధానాన్ని ట్రోల్ చేశారు. దీన్ని సినీ ప్రముఖులు కూడా చూసి ఉండొచ్చు. దీంతో ఆ మహిళ ఎంత బాధపడ్డారో ఓసారి అర్థం చేసుకోవాలి. బేషరతుగా మంత్రి తన వ్యాఖ్యల్ని ఉపసంహరించుకున్నారు. మంత్రులు, కాంగ్రెస్ నాయకులు మాట్లాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి" అని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు.

# చంద్రబాబు సీఎం మాత్రమే కాదు.. సీఈవో: మధ్యప్రదేశ్ సీఎం

కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడితో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దిల్లీలో భేటీ అయ్యారు.



**దిల్లీ, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** కేంద్ర మంత్రి రామ్మోహన్నాయుడితో మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్ దిల్లీలో భేటీ అయ్యారు. దేశంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అభివృద్ధి అంశాల గురించి వారు చర్చించారు. ఈ సందర్భంగా మోహన్ యాదవ్.. ఏపీలో కూటమి ప్రభుత్వ పరిపాలనపై సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడిని ప్రశంసించారు. ఆయన సీఎం మాత్రమే కాదని.. సీఈవో అంటూ కితాబిచ్చారు.

# వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ రిమాండ్ పొడిగింపు

వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ను పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు.



**మంగళగిరి, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** వైకాపా మాజీ ఎంపీ నందిగం సురేష్ను పోలీసులు మంగళగిరి కోర్టులో హాజరు పరిచారు. ఆయనకు న్యాయస్థానం మరో 14 రోజుల రిమాండ్ విధించింది. ఈ నెల 17 వరకు రిమాండ్ను పొడిగించింది. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నందిగం సురేష్ అరెస్టయిన సంగతి తెలిసిందే. 2021 అక్టోబర్ 19న మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంపై వైకాపా మూకలు దాడికి తెగబడ్డాయి. కార్యాలయం వద్ద వాహనాలు, అద్దాలు, కార్యాలయం లోపల ఫర్నిచర్ ధ్వంసం చేశాయి. అడ్డుకున్న వారిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చాయి. ఈ ఘటనపై కార్యాలయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినా.. వైకాపా పాలనలో విచారణ ముందుకు సాగలేదు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేసు విచారణను పోలీసులు వేగవంతం చేశారు. దాడికి పాల్పడిన వారిని వీడియోల ఆధారంగా గుర్తించి పలువురిని అరెస్టు చేశారు.

# మహిళా కమిషన్ మాజీ ఛైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పిటిషన్ కొట్టివేత

**అమరావతి, (రిపబ్లిక్ న్యూస్), అక్టోబర్ 3:** మహిళా కమిషన్ మాజీ ఛైర్పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి పిటిషన్ ను ఏపీ హైకోర్టుకొట్టివేసింది. గత నెల 23న ఆమెను మహిళా కమిషన్ ఛైర్పర్సన్ పదవి నుంచి తొలగిస్తూ ఏపీ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈక్రమంలో ఆ వె-ుమో అమలును నిలుపుదల చేయాలంటూ ఆమె హైకోర్టులో పిటిషన్ దాఖలు వేశారు. దీనిపై వాదనలు విన్న న్యాయస్థానం గజ్జల వెంకటలక్ష్మి దాఖలు చేసిన అనుబంధ పిటిషన్ను కొట్టివేసింది. వైకాపా కార్యకర్తలా వ్యవహరిస్తున్న ఆమెను మహిళా కమిషన్ ఛైర్పర్సన్ పదవి నుంచి రాష్ట్ర ప్రభుత్వం గత నెలలో ఉద్వాసన పలికింది.







printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1923 : బ్రిటిషు సామ్రాజ్యములో పట్టభద్రురాలైన తొట్టతొలి వనితలలో ఒకరు, స్త్రీవిమోచన కార్యకర్త కాదంబినీ గంగూలీ మరణం (జ.1861). (చిత్రంలో)
- 1957 : ఆకాశవాణి విశిష్ట సేవ వివిధ భారతి ప్రారంభం.
- 1990 : బెర్లిన్ గోడ తొలగింపుతో జర్మనీ విలీనం జరిగినది.
- 1992 : చరిత్ర పరిశోధకులు, రచయిత, న్యాయవాది, స్వాతంత్ర్య సమరయోధుడు దిగవల్లి వేంకటశివరావు మరణం.(జ.1898).
- 2006 : తమిళ, తెలుగు సినిమా నటి, నాట్య కళాకారిణి ఇ.వి.సరోజ మరణం (జ.1935).-


కాదంబినీ గంగూలీ



బెర్లిన్ గోడ


సరోజ

రిపబ్లిక్ స్పోర్ట్స్

## ఐపీఎల్ 2025.. ధోనీ కోసమే అన్క్యాప్డ్ రూల్: భారత మాజీ క్రికెటర్

**చెన్నై సూపర్ కింగ్స్ మాజీ సారథి ఎంఎస్ ధోనీ కోసమే ఐపీఎల్ 2025 సీజన్లో అన్క్యాప్డ్ ప్లేయర్ నిబంధనను తీసుకొచ్చారని భారత మాజీ ఆటగాడు దినేశ్ కార్తిక్ అభిప్రాయపడ్డాడు.**



ఐపీఎల్ 2025 సీజన్లో అన్క్యాప్డ్ ప్లేయర్ నిబంధనను అమల్లోకి తీసుకురావాలని ఐపీఎల్ పాలకవర్గం తీసుకున్న నిర్ణయాన్ని భారత మాజీ వికెట్ కీపర్ దినేశ్ కార్తిక్ సమర్థించాడు. ధోనీ కోసమే ఈ నిబంధనను రూపొందించారని పేర్కొన్నాడు. ఏ భారత ఆటగాడైనా ఐపీఎల్ సీజన్కు ముందు అయిదేళ్ల పాటు అంతర్జాతీయ క్రికెట్ తుది ఎలెవన్ (టెస్టు, వన్డే, టీ20)లో ఆడకపోతే లేదా బీసీసీఐ సెంట్రల్ కాంట్రాక్ట్ కలిగి ఉండకపోతే.. అతడిని అన్క్యాప్డ్ ప్లేయర్గా పరిగణిస్తారు. ఈ నిబంధన భారత ఆటగాళ్లకు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం చెన్నై సూపర్ కింగ్స్ ఎంఎస్ ధోనీని రిటైన్ చేసుకుంటుందని ప్రచారం జరుగుతోంది. అయితే, దీనిపై ధోనీ, సీఎస్కే ఎలాంటి ప్రకటన చేయలేదు. "అందరూ దీనిగురించే మాట్లాడుకుంటున్నారు. ఈ నిబంధన ఒక వ్యక్తి (ధోనీని ఉద్దేశించి) కోసం రూపొందించారు. నేను దానికోసమే ఎదురుచూశాను. ఐపీఎల్లో ఈ వ్యక్తి ప్రధాన పాత్ర పోషించాడు. బీసీసీఐ అన్ని టీమ్లు లకు లబ్ధి చేకూర్చడంతోపాటు తాను కూడా లాభపడుతోంది. లీగ్ను 15-18 సంవత్సరాలుగా విజయవంతంగా ముందుకుతీసుకెళ్తూ ఆటగాళ్లను కూడా సంతోషంగా ఉంచుతోంది. ఏ టీవీ బ్రాడ్కాస్టర్ని అడిగినా ఈ ఆటగాడు (ధోనీ) మైదానంలో అడుగు పెడితే రేటింగ్స్ పెరుగుతాయనే సమాధానం వస్తుంది. ఇది వాస్తవం. లీగ్కు ఉపయోగపడే పనిని ఎందుకు చేయకకూడదు? మీరు తీసుకున్న ఈ నిర్ణయం సరైనదే. అనాక్యాప్డ్ రూల్ గురించి అన్ని జట్లకు సమాచారం అందించారు. ఫ్రాంచైజీలు ఒకే చెబితే ముందుకెళతారు. దీనిని టీమ్లు వ్యతిరేకించవు. అతను స్పెషల్ క్రికెటర్" అని దినేశ్ కార్తిక్ వివరించాడు. ఈసారి ఫ్రాంఛైజీలు ఆరుగురు ఆటగాళ్లను అట్టిపెట్టుకోవడానికి ఐపీఎల్ పాలకవర్గం అనుమతినిచ్చింది. ఇందులో ఒక రైట్ టు మ్యాచ్ (ఆర్టీఎం) కలిసి ఉంటుంది. అట్టిపెట్టుకున్న అయిదుగురి కోసం రూ.75 కోట్లు ఖర్చు పెట్టాల్సివుంటుంది. జట్టు దగ్గర ఉండే మొత్తం రూ.120 కోట్లు. ఫ్రాంచైజీలు తాము రిటైన్ చేసుకునే ఆటగాళ్ల జాబితాను సమర్పించేందుకు అక్టోబర్ 31 తుది గడువు. నవంబరులో ఐపీఎల్ వేలం జరిగే అవకాశముంది.

## 'భారతీయుడు 3'.. వైరలవుతోన్న వార్త

'భారతీయుడు 3'కు సంబంధించిన ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. ఈ సినిమా కోసం నిర్మాతలు ఓటీటీ సంస్థతో చర్చలు జరుపుతున్నట్లు వార్తలు వస్తున్నాయి.. దీనిపై అధికారిక ప్రకటన కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు.



అగ్ర కథానాయకుడు కమల్ హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్లో తెరకెక్కిన చిత్రం 'భారతీయుడు 2'. ఈ సినిమాకు సీక్వెల్గా 'భారతీయుడు 3' రానుంది. తాజాగా ఈ సినిమా గురించి ఓ వార్త సోషల్ మీడియాలో వైరల్ గా మారింది.'భారతీయుడు 2' షూటింగ్ సమయంలోనే దీని మూడో పార్ట్లోని కీలక సన్నివేశాలు చిత్రీకరించారు. రెండోభాగం రిలీజైన ఆరు నెలలకు మూడో పార్ట్ను రిలీజ్ చేయాలని చిత్రబృందం భావించింది. అయితే ఈ ఏడాది భారీ అంచనాల నడుమ విడుదలైన 'భారతీయుడు 2' ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. ఈనేపథ్యంలో దీని మూడోభాగం చర్చనీయాంశంగా మారింది. 'భారతీయుడు 3'ను డైరెక్ట్గా ఓటీటీలో విడుదల చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. దీనికోసం నిర్మాణసంస్థ నెటిక్స్ తో చర్చలు జరుపుతోందని త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన రానుందని సోషల్ మీడియాలో కొన్ని పోస్టు షేర్ అవుతున్నాయి. అయితే ఈ విషయంపై అటు నిర్మాణసంస్థ. నెటిక్స్ ఇప్పటివరకు స్పందించలేదు. 1996లో విడుదలైన 'భారతీయుడు'కు సీక్వెల్స్గా రెండు, మూడు భాగాలు తెరకెక్కాయి. రెండో పార్ట సిద్ధార్థ్, రకుల్ ప్రీత్సింగ్, ఎసీజే సూర్య, బాబీ సింహా, వివేక్, ప్రియా భవానీశంకర్, బ్రహ్మానందం, సముద్రఖని కీలక పాత్రలు పోషించారు. సమాజంలోని అవినీతి, అన్యాయాల్ని రూపుమాపడానికి సేనాపతి ఏం చేశాడు? ఈ క్రమంలో ఆయనకు ఎదురైన సంఘటనలు ఏమిటి? అనే ఆసక్తికర అంశాలతో ఈ సినిమా రూపుదిద్దుకుంది. మేకింగ్పరంగా సినిమా ఉన్నతంగా ఉన్నప్పటికీ నిడివి ఎక్కువగా ఉన్నందున అది ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయిదని సోషల్ మీడియాలో పలువురు అభిప్రాయపడ్డారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'దేవర' సక్సెస్ మీట్..

## క్షమాపణలు చెప్పిన నాగవంశీ


'దేవర' సినిమా సక్సెస్ మీట్పై నిర్మాత నాగవంశీ పోస్ట్ పెట్టారు.




ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన 'దేవర' మంచి విజయాన్ని అందుకున్న విషయం తెలిసిందే. దీంతో ఈ సినిమా సక్సెస్ మీట్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూ-స్తున్నారు. తాజాగా ఈ విషయంపై నిర్మాత నాగవంశీ పోస్ట్ పెట్టారు. ఈ ఈవెంట్ను భారీగా నిర్వహించాలని అనుకున్నప్పటికీ అనుమతులు లభించలేదని తెలిపారు. సక్సెస్ మీట్ను నిర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరారు."దేవర'ని ఈ స్థాయిలో ఆదరించినందుకు అందరికీ న్యవాదాలు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం సుకోవడంలో సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు. ప్రీ రిలీజ్ ఈవెంట్ హించలేకపోవడంతో విజయోత్సవ వేడుకనైనా ఘనంగా లని ఆర్ ఎంతో భావించారు. మేము ఎన్నో ప్రయత్నాలు సినప్పటికీ దసరా, దేవీ నవరాత్రి ఉత్సవాలు ఉన్న కారణంగా మా వేడుకకు రెండు తెలుగు రాష్ట్రాల్లో బహిరంగ వేదికలకు అనుమతులు పొందలేకపోయాం. ఈ పరిస్థితి మా నియంత్రణలో లేదు. ఈ ఈవెంట్ను ర్వహించలేకపోతున్నందుకు అభిమానులను క్షమాపణలు కోరుతున్నాం. వేదిక అనుమతి కోసం మేము ఇంకా ప్రయత్నిస్తూనే ఉన్నాం. మీ ప్రేమతో ఎన్టీఆర్ మరింత ఎత్తుకు ఎదగాలని ఆశిస్తున్నా" అని పోస్ట్ పెట్టారు.ఇదీ చదవండి: అలాంటి విషయాలు బయటకు చెప్పను: వరుణ్ తేజ్'దేవర' ఎంత వసూళ్లు చేసిందంటే.ప్రీ సేల్ బుకింగ్స్ లోనే హవా కొనసాగించిన 'దేవర.. విడుదలయ్యాక కూడా మంచి కలెక్షన్లు సొంతం చేసుకుంటోంది ఇప్పటివరకు రూ.396 కోట్లు వసూలు చేసింది. ఈ విషయాన్ని తెలుపుతూ చిత్రబృందం తాజాగా ఓ పోస్టర్ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ఎన్టీఆర్ సరసన జాన్వీకపూర్ అలరించగా విలన్గా సైఫ్ అలీఖాన్ కనిపించిన సంగతి తెలిసిందే.

## ఈ జ్యూస్‌లు తాగితే బాడీలో బ్లడ్ లెవల్స్ అమాంతం పెరుగుతాయి

**ఐరన్ ఆరోగ్యానికి చాలా ముఖ్యం. ఐరన్ లోపం ఉంటే రక్తహీనత సమస్య వేధిస్తుంది. దీనిని తగ్గించేందుకు కొన్ని ఐరన్ రిచ్ డ్రింక్స్ మీకు హెల్ప్ చేస్తాయి. అవేంటంటే..**




### ఐరన్ లోపానికి కారణాలు..



ఐరన్ లోపం రావడానికి చాలా కారణాలు. ఆడవారిలో ఎక్కువగా హెవీ మెనుస్ట్రువల్ పీరియడ్స్కుడుపు, ప్రేగులలో రక్తస్రావం జరగడంఐరన్ని గ్రహించకపోవడంకిడ్నీ సమస్యలుదీర్ఘకాలిక మంటకి కార-ణమయ్యే ఆరోగ్య సమస్యలు

బాడీలో ఐరన్ తక్కువగా ఉంటే శక్తి తగ్గడం, అలసట, ఏకాగ్రత తగ్గడం, చర్మ పాలిపోవడం వంటి సమస్యలు ఎదురవుతాయి. అయితే, మనం ఐరన్ ఫుడ్స్, డ్రింక్స్ తీసుకోవడం వల్ల ఈ సమస్య తగ్గుతుంది. ఐరన్ సహజంగానే కొన్ని ఫుడ్స్లో ఉంటుంది. వీటిని మీ డైట్లో ఎలా చేర్చుకునేందుకు కొన్ని డ్రింక్స్ తీసుకోవచ్చు.

### ప్రూనే జ్యూస్..



డ్రై చేసిన ప్లమ్ ఫ్రూట్స్‌నే ప్రూనే అంటారు. వీటితో జ్యూస్ చేసుకుని తాగడం వల్ల ఐరన్ సహా ముఖ్య పోషకాలు అందుతాయి. దీనిని తాగడం వల్ల ఐరన్ లోపం తగ్గుతుంది. ఈ జ్యూస్‌లో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. కాబట్టి, రక్తపోటు కూడా తగ్గుతుంది.

### స్పినాచ్ స్మూతీ..



స్మూతీలలో ఎన్నో పోషకాలు ఉంటాయి. బచ్చలికూరలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. దీనిని పైనాపిల్‌తో కలిపి తీసుకోవచ్చు. పైనాపిల్‌ని యాడ్ చేయడం వల్ల విటమిన్ సి కంటెంట్‌తో పాటు రుచి కూడా పెరుగుతుది. అవసరమైతే ఇందులో నిమ్మ, నారింజలు కూడా యాడ్ చేయొచ్చు.

### గ్రీన్ జ్యూస్..



గ్రీన్ జ్యూస్ తాగడం వల్ల ఐరన్ లెవల్స్ పెరగడమే కాదు. స్కిన్ మెరుస్తుంది. బరువు కూడా తగ్గుతారు. దీనికోసం మీరు నిమ్మరసం, పార్స్లీ, పియర్, బచ్చలికూర, సెలెరీ వంటి వాటితో జ్యూస్ చేసుకోవచ్చు. ఇందులో విటమిన్ సి ఎక్కువగా ఉండే పండ్లని యాడ్ చేసుకోవచ్చు. దీని వల్ల ఐరన్ లభిస్తుంది.

### దానిమ్మ..



దానిమ్మలో కూడా ఐరన్‌తో పాటు విటమిన్ సి ఎక్కువగా ఉంటుంది. దీంతో పాటు ఖర్జూరాల్లో ఐరన్ లెవల్స్ పుష్కలంగా ఉంటాయి ఈ రెండింటిని కలిపి తీసుకోవడం చాలా మంచిది. ఐరన్, విటమిన్ సి కలిపి తీసుకుంటే బాడీలో విటమిన్ సి అనేది ఐరన్‌ని అబ్జార్వ్ చేసేందుకు హెల్ప్ చేస్తుంది.

గమనిక: ఆరోగ్య నిపుణులు, అధ్యయనాల ప్రకారం ఈ వివరాలను అందించాం. ఈ కథనం కేవలం మీ అవగాహన కోసమే. ఇవి పాటించడం వల్ల ఫలితాలు అనేవి వ్యక్తిగతం మాత్రమే. వీటిని పాటించే ముందు డైటీషియన్‌ని సంప్రదించడమే ఉత్తమ మార్గం. గమనించగలరు.